క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వీధిదీపాలు వెలగక అవస్థలు

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం పరిధి అశోక్ నగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని రోడ్ల పొడవునా తుప్పలు పెరిగిపోవడంతో పాములు, విష కీటకాలు రోడ్లపై సంచరిస్తున్నాయని... లైట్లు వెలగకపోవడంతో పాదచారులు వాటి బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని లుంబినీ వనం పార్కులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదని, వెంటనే అధికారులు స్పందించి పునరుద్ధరించాలని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గాదె రోశిరెడ్డి, బ్రహ్మాజీ తదితరులు కోరుతున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర


ముత్యాలమ్మ అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారిని వివిధ వర్ణాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జాతర మహోత్సవంలో భాగంగా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని గండిగుండం, మామిడిలోవ పంచాయతీల్లో సోమవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో అడపా లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని లవరాజు చెప్పారు.

తీరానికి కొత్త శోభ


ఐటీ జంక్షన్ వద్ద సుందరంగా తీర్చిదిద్దిన బీచ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రోజురోజుకూ మరింత సుందరంగా ముస్తాబవుతోంది. ఇప్పటికే డివైడర్లకు, సైడ్ వాల్స్‌కు, ఫుట్ పాత్‌లకు వివిధ వర్ణాలతో అద్భుతమైన కళాకృతులతో రంగులు అద్దారు. విద్యుత్ దీపాలతో రాత్రి సమయాల్లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికితోడు ఆదివారం ఐటీ జంక్షన్ కల్వర్టు వద్ద ఐరన్ బాక్స్‌లలో నల్లరాళ్లు ఏర్పాటు చేయడంతో మరింత సుందరంగా కనిపిస్తోంది.

నగరానికి సమీపంలో ఉన్నా వసతులు శూన్యం


పీఎం పాలెం - ఏఎస్ఆర్ నగర్ మార్గంలో మట్టి రోడ్డు


అపార్ట్‌మెంట్ల ముందు నిలిచిన బురద


రహదారి మధ్యలో డెబ్రిస్ పోగులు

కనీస సౌకర్యాలు లేక ఏఎస్ఆర్ నగర్ వాసుల అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంను ఆనుకుని ఉన్న ఏఎస్ఆర్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు లేక ఇక్కడి అపార్ట్‌మెంట్ల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వందకు పైగా అపార్టుమెంట్లలో ఇక్కడ 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. బిల్డర్లు వీరికి ప్లాట్లు విక్రయించి మిగిలిన వసతులు కల్పించకుండానే జారుకున్నారు. వీరు చూడటానికి ఆకాశహార్మ్యలలో నివసిస్తున్నా బయటకు వస్తే బురదలో, రాళ్ల కుప్పల్లో, తుప్పలలో కాళ్లు పెట్టాల్సిందే. ఇక్కడి అపార్ట్‌మెంట్లలో పలువురు ఉద్యోగులు, బడా వ్యాపారులు, సేవా రంగంలో పనిచేస్తున్న వారితోపాటు ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు. బిల్డర్లు నిర్మించిన అంతర్గత కాలువలు తప్ప మురుగునీరు బయటకు వెళ్లే పెద్ద డ్రైనేజీలు ఇక్కడ మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో ఈ మురుగులోనే దోమలు, పందులు నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. అపార్ట్‌మెంట్ల చుట్టూ ఉన్న పార్కుల నిర్వహణ లేక తుప్పలతో, రహదారులు డెబ్రిస్‌తో నిండిపోయాయి. చెత్త సేకరణకు తప్ప శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బంది రాకపోవడంతో అంతర్గత కాలువలు నాచుపట్టి దుర్వాసన వస్తోంది. ఎన్నికల సమయంలో తప్ప సమస్యలు చెప్పుకుందామంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కనిపించడం లేదంటూ స్థానిక నివాసులు వాపోతున్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ..

ఏఎస్ఆర్ నగర్‌కు నాలుగు వైపులా ఆనుకుని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మధురవాడ జాతీయ రహదారి, సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల, కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్ ఉన్నాయి. బయటి నుంచి చూసేవారికి ఈ ప్రాంతం ఎంతో పొందికగా ఉన్నట్టు కనిపించినా గ్రామంలో అడుగుపెట్టి చూస్తే సమస్యలు తెలుస్తాయని స్థానికులు అంటున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల నిర్వహణ, వీధిదీపాలు, పారిశుధ్య పనులు నిర్వహించి గ్రామం ప్రతిష్ట పెంచాలని స్థానికులు జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

వర్షం కురిస్తే రాకపోకలు బంద్



వర్షం కురిస్తే అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు రాలేకపోతున్నాం. ఇటీవల సొంతంగా డబ్బులు ఖర్చు చేసి గోతుల్లో డెబ్రిస్ వేయించుకున్నాం. డ్రైనేజీలు లేక అపార్ట్‌మెంట్ల చుట్టూ నిలిచిన మురుగుతో దుర్వాసన వస్తోంది.

– పి.భారతి, గృహిణి

కాళ్ల కింద విష పురుగులు



మా గ్రామానికి ఒకవైపు అటవీ ప్రాంతం ఉండటం, అపార్ట్‌మెంట్ల చుట్టూ పార్కుల నిర్వహణ లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడంతో నిత్యం విష పురుగులు కాళ్ల కింద పడుతున్నాయి. అపార్ట్‌మెంట్ల నుంచి పిల్లలను బయటకు పంపాలంటే ఆందోళనగా ఉంటుంది.

– ఎస్వీ కృష్ణారావు, విశ్రాంత ఉద్యోగి

అభివృద్ధిపై దృష్టి సారించాలి



నగరానికి చేరువలో ప్రశాంతంగా ఉంటుందని ఇక్కడ లక్షలాది రూపాయలు పోసి ప్లాట్లు కొనుక్కుంటే వసతులు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు లేవు. సంబంధిత అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

– టీబీఎమ్ రావు, న్యాయవాది

మొబైల్ బాత్‌రూమ్స్‌కు తాళాలు


సాగర్‌నగర్‌లో బీచ్ వద్ద తాళాలు వేసి ఉన్న మొబైల్ బాత్‌రూమ్స్

కొమ్మాది: పర్యాటక ప్రాంతమైన సాగర్‌నగర్ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ బాత్‌రూమ్స్‌కు ఎప్పుడూ తాళాలు వేసి ఉండడంతో పర్యాటకులు అసహనానికి గురవుతున్నారు. గతంలో సాగర్‌నగర్ పర్యటనలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వీటిని పరిశీలించారు. బాత్రూమ్స్‌కు తాళాలు వేసి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అయినప్పటికీ స్థానిక అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ప్రస్తుతం సాగర్‌నగర్ బీచ్ వద్ద కొబ్బరి చెట్ల పార్కు, సుందరమైన రోడ్డు, విద్యుత్ దీపాలంకరణ ఉండటంతో గతం కంటే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో వీటిని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాత్‌రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

బీచ్‌లో స్వచ్ఛ భారత్


తీరంలో చెత్త సేకరిస్తున్న ఏబీవీపీ సభ్యులు

భీమునిపట్నం: స్థానిక బీచ్‌లో ఆదివారం అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) భీమిలి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు బీచ్‌లోని చెత్త సేకరించారు. రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు మాట్లాడుతూ ఏబీవీపీ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. సభ్యులు బుత్తల వంశీ, సుశాంత్, ప్రవీణ్, చక్రి, అరవింద్, రాజేష్, ఈశ్వర్, నాగరాజు, శ్రీను, చరణ్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


తునిపాలెంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, తదితర 100 గ్రంథాలపై ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భీమిలి మండలం తాటితూరుకు చెందిన రావణ అక్షయ్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఒక్కసారైనా భగవద్గీత చదవాలని కోరారు. ఈ సందర్భంగా చిట్టివలస, మారికవలస, శారదానగర్, భీమిలి పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ఆదమ్మ, మీనా, అప్పలనరసమ్మ, సర్వదారి, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం, బాందేవుపురం పంచాయతీ రెల్లిపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమి విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు ఎస్.శ్రీనివాస్, బి.అప్పలనాయుడు, కె.సంతోష్, టి.మంగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ రాంబాబు జన్మదిన వేడుకలు


ఎంపీపీ రాంబాబుకు కేక్ తినిపిస్తున్న లక్ష్మణరావు

పద్మనాభం: పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు జన్మదిన వేడుకలు ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేక్ కట్ చేశారు. రాంబాబుకు జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కేక్ తినిపించారు.

పలు శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాంబాబు విశాఖపట్నం ఆనంద మార్గా ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అముజూరి అప్పారావు, ఈర్ల ఈశ్వరరావు, బుగత సత్యనారాయణ, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలు


నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

ఒడియా భాషలోకి 'సింహాచలం క్షేత్ర మహత్యం'


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు, లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, తదితరులు

సింహాచలం: ఒడియా భాషలో రచించిన శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్ర మహత్యం పుస్తకావిష్కరణ ఆదివారం సింహగిరిపై ఘనంగా జరిగింది. సింహాచలానికి చెందిన పాంతరాత్ర ఆగమశాస్త్ర పండితుడు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు తెలుగులో రచించిన సింహాచలం క్షేత్ర మహత్యం పుస్తకాన్ని ఒడియా భాషలోకి భక్తుడు సాయికుమార్ తర్జుమా చేశారు. ఆ పుస్తకాలను స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు వి.బి.వి.రమణమూర్తి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట రహదారిపై అంధకారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ బంగ్లామెట్ట రహదారిపై అంధకారంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శివాలయం నుంచి భోగాపురం వారి వీధి వరకు ఒకవైపు పూర్తిగా వీధి దీపాలు ఇటీవల వరుసగా వెలగడం లేదు. దీంతో బంగ్లామెట్ట కార్నర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో వీధి దీపాలను పునరుద్ధరించాలని బంగ్లామెట్ట వాసులు కోరుతున్నారు.

వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించండి

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్


చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పర్యటిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

తగరపువలస: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు వెలుగు చూసిన సమస్యలు వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ ఆదేశించారు. ఆదివారం ఆయన చిట్టివలస టౌన్ సెక్షన్ కార్యాలయంలో చిట్టివలస, భీమిలి సబ్‌స్టేషన్ పరిధిలోని సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల బకాయిలు వేగవంతంగా వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది ఫీల్డ్‌లో పని చేసేటప్పుడు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఉద్యోగులు పని చేసే ప్రదేశంలో నివసిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. సమావేశంలో ఈఈ పి.శ్రీనివాసరావు, ఏడీ రమేష్, ఏఈఈలు బొట్టా రవి, జాగరపు రాము, సకరయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ఆరాధన


బిషప్ కొర్నేలియస్ దంపతులతో చర్చి సభ్యులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద నున్న పురాతన సెయింట్ పీటర్స్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. చర్చ్ ఆఫ్ సౌతిండియా బిషప్, అధ్యక్షులు కొర్నేలియస్ పాల్గొని దైవ సందేశాన్ని వినిపించారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని సూచించారు. వివాహాలు కాని పేద యువతులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు మాట్లాడుతూ పేద మహిళలు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడానికి చర్చి ఆవరణలో ప్రత్యేక భవనాన్ని నిర్మించనున్నట్టు వెల్లడించారు. అనంతరం బిషప్ దంపతులను ఘనంగా సత్కరించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ ప్రభుదర్శన, చార్లెస్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు


దాకమర్రిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వ్యవసాయాధికారులు ఆదివారం అవగాహన కలిగించారు. ప్రాంతీయ వ్యవసాయ అధికారులు ప్రకాష్, హేమసుందర్ బృందం ఈ పంచాయతీలో పర్యటించి వర్షాభావ పరిస్థితుల్లో మీనామృతం, బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన కలిగించారు. తక్కువ ఖర్చుతో వీటిని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు, ప్రయోజనాలపై రైతులతో చర్చించారు. ప్రకృతి సాగులోనే పంటలు పండిస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, స్థానిక అధికారులు చక్రవర్తి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

విద్యుత్ లైట్లు అమర్చాలి


మానం ఆంజనేయులు కాలనీలో విద్యుత్ లైట్ లేని స్తంభం

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు ఐటీ జంక్షన్ సమీపంలోని మానం ఆంజనేయులునగర్‌లో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలకు లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. జీవీఎంసీ విద్యుత్ శాఖ సిబ్బందికి, అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోతోంది. ముఖ్యంగా కాలనీ శివారు ప్రాంతంలో 175/ఏ/3/4/3/4 నంబరు గల విద్యుత్ స్తంభం పక్కన కొన్ని నెలల కిందట కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ లైటు అమర్చలేదు. దీంతో చిమ్మ చీకట్లు అలుముకుని ఇబ్బందులు పడుతున్నాం. పైగా కాలనీ శివారు ప్రాంతం కావడంతో పాములు, విష పురుగుల సంచారం మరింత ప్రమాదకరంగా మారింది. జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– నాయుడు బాబు, మానం ఆంజనేయులు నగర్, ఐటీ జంక్షన్.

లే అవుట్‌లో వ్యర్థాల డంపింగ్


కొత్తవలసలోని లే అవుట్‌లో లారీ సిబ్బంది వేసిన వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధిలోని కొత్తవలస వద్ద విశాఖ క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ లే అవుట్‌ను క్వారీ లారీ సిబ్బంది డంపింగ్‌యార్డుగా మార్చేశారు. మేము కష్టార్జితంతో కొనుగోలు చేసుకుని వేసుకున్న లే అవుట్‌ను వ్యర్థాలతో నింపివేస్తున్నారు. ప్రైవేట్ లే అవుట్‌లో వ్యర్థాలు డంప్ చేస్తున్న వారిపై జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– యేసురాజు, కొత్తవలస, భీమిలి జోన్.

మదుము మధ్య చీలికతో ప్రమాదాలు


అవంతి కళాశాల నుంచి అన్నవరం రహదారిలో మదుము మధ్య చీలిక

తగరపువలస: భీమిలి మండలం అవంతి కళాశాల నుంచి అన్నవరం తీరప్రాంతానికి వెళ్లే రహదారిలో గోస్తనీనది గెడ్డపై మదుము మధ్య చీలిక ఏర్పడింది. దీంతో చీకటి పడిన తర్వాత ద్విచక్ర వాహనాల టైర్లు ఈ పలకల మధ్య ఖాళీలో పడి ఇరుక్కుపోతున్నాయి. ముఖ్యంగా కొత్తవాళ్లు ఈ మార్గంలో ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల నివారణకు ఖాళీ ఏర్పడిన చోట మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

బాలాజీనగర్‌లో నీరు వృథా


వృథాగా పోతున్న కుళాయి నీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో పైప్‌లైన్ లీకేజీ కారణంగా మూడు రోజులుగా నీరు వృథాగా సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తోంది. దీనికితోడు పూడిక కారణంగా డ్రైనేజీలో నిండిన నీరు కూడా బయటకు రావడంతో అర కిలోమీటరు వరకు సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తోంది. నీటి వృథాను అరికట్టడంతో పాటు డ్రైనేజీలను తెరిచి పూడిక తొలగించాలని బాలాజీ నగర్ వాసులు కోరుతున్నారు.